ఊళ్లుగా జగనన్న కాలనీలు

- శరవేగంగా జగనన్న కాలనీల పనులు
- నెరవేరిన పేదోడి సొంతింటి కల
- పేట నియోజకవర్గంలో 8670 ఇళ్లు మంజూరు
- 3094 ఇళ్ల పనులు పూర్తి
- సకాలంలో బిల్లుల మంజూరు
- గృహనిర్మాణంపై లబ్ధిదారుల్లో పెరుగుతున్న ఆసక్తి



ఊరిని తలపిస్తున్న జగ్గయ్యపేట మండలం ముక్త్యాలలోని జగనన్న కాలనీ



జగ్గయ్యపేటలోని జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్లు

జగ్గయ్యపేట అర్బన్: దశాబ్దాలుగా కలగా ఉన్న పేదోడి సొంతింటి కల నెరవేరింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోలో భాగంగా ఇచ్చిన పేదలకు సొంతిళ్లు హామీని అధికారంలోకి రాగానే నవరత్నాల పథకం కింద అమలుచేయడంతో జగ్గయ్యపేట నియోజకవర్గంలో వేలాది మంది పేదలు సొంతిళ్లు సమకూరాయి. జగనన్న కాలనీల కింద పేదలందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయడంతోపాటు గృహనిర్మాణానికి సైతం ఆర్థికస హాయం అందించడంతో లబ్ధిదారులు పెద్దఎత్తున నిర్మాణాలు చేపట్టారు. దీంతో జగనన్న కాలనీలు కాస్తా..ఊర్లుగా మారాయి.

97 లేఅవుట్లు..8670 ఇళ్లు..

జగ్గయ్యపేట నియోజవర్గ పరిధిలోని జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి, నందిగామ మండలంలోని ఏటిపట్టు గ్రామాల్లో ఉన్న నిరుపేదల కోసం ప్రభుత్వం 103లేఅవుట్లలో పేదలకు ఇళ్లస్థలాలను మంజూరు చేసింది.అయితే ఇందులో ఆరు లేఅవుట్లకు సంబంధించి టీడీపీ నాయకులు కోర్టులో కేసులు వేయడంతో అక్కడ ఇళ్ల నిర్మాణ ప్రకియ నిలిచిపోయింది. మిగిలిన 97లేఅవుట్లలో నియోజకవర్గంలోని అర్హులైన పేదలందరికి 8670 ఇళ్లను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో 7518మంది ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించగా, ఆయా కాలనీల్లో చేపట్టిన ఇళ్ల నిర్మాణపు పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే 3094 ఇళ్ల నిర్మాణాలు పూర్తికావడంతో అత్యధికశాతం మంది లబ్ధిదారులు గృహప్రవేశాలు కూడా చేశారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్నవారిలో కొద్దిమంది గృహప్రవేశాలు చేయాల్సి ఉంది. మిగిలిన గృహాల పనులు వివిధ దశల్లో ఉన్నాయి. సకాలంలో బిల్లులు, సిమెంట్ మంజూరు చేస్తుండటంతో ఇళ్ల నిర్మాణాలకు లబ్ధిదారులు ఆసక్తిచూపుతున్నారు.

నిర్మాణంలో ఉన్న ఊర్లు..

సాధారణంగా వందలోపు ఇళ్ల నిర్మాణం జరిగితే ఆయా ప్రాంతాలను కాలనీలు అని పిలుస్తుంటారు. కానీ జగ్గయ్యపేట నియోజకవర్గవ్యాప్తంగా జగనన్న కాలనీలో పేరుతో ఏకంగా ఊర్లకు ఊర్లే కొత్తగా ఏర్పాటవుతున్నాయని చెప్పవచ్చు.ఒక్కో లేఅవుట్‌లో వందలాది ఇళ్ల నిర్మాణం చేపట్టడంతో కాలనీలకు బదులుగా ఊర్లే వెలుస్తున్నాయని లబ్ధిదారులు చెబుతున్నారు. జగ్గయ్యపేట పట్టణంలోని బలుసుపాడు రోడ్‌లో రెండు లేఅవుట్లు ఏర్పాటు చేయగా, ఇక్కడ 1040 ఇళ్లు మంజూరయ్యాయి. వీటిలో 861మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం కోసం పేర్లు నమోదు చేసుకోగా, ఇప్పటికే 341ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగిలినవి ఇళ్ల నిర్మాణపు పనులు వివిధ దశల్లో ఉన్నాయి. జగ్గయ్యపేట రూరల్ మండలంలో 1249మంది ఇళ్ల నిర్మాణానికి రిజిస్ట్రేషన్ చేసుకోగా, 556మంది ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేసుకున్నారు. పెనుగంచిప్రోలులో 1970మంది ఇళ్ల నిర్మాణాలు మొదలుపెట్టగా, 766 ఇళ్లు పూర్తయ్యాయి. వత్సవాయి మండలంలో 2425 ఇళ్లకుగాను 976 ఇళ్లు, నందిగామ మండలంలోని ఏటిపట్టుగ్రామాల్లో 1013 మంది ఇళ్ల నిర్మాణాలకు రిజిస్ట్రేషన్ చేసుకోగా 455 ఇళ్లు పూర్తయ్యాయి. మిగిలిన ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి.

రాయితీపై నిర్మాణ సామాగ్రి ..

ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు చేయూతనిచ్చేందుకు ప్రభుత్వం మూడు శాతం వడ్డీకి రూ.35వేలు బ్యాంకు రుణ సాయం చేస్తోంది. రుణాలు పొందేందుకు వీలుగా సిబిల్ స్కోరు నుంచి పేదలకు మినహాయింపు వచ్చేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది. రూ.15 వేల విలువ చేసే 20టన్నుల ఇసుకను లబ్ధిదారులకు ఉచితంగా అందిస్తోంది. సబ్సిడీపై ఇనుము, సిమెంట్, ఇతర వస్తువులను ప్రభుత్వమే సరఫరా చేస్తోంది. తద్వారా ఒక్కో లబ్ధిదారునికి రూ.40వేల మేర లబ్ధి చేకూరనుంది. మొత్తంగా 12రకాల వస్తువులను సబ్సిడీ కింద సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్రప్రభుత్వం అందిస్తూ లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేసుకునేందుకు సహకరిస్తోంది.

ఎమ్మెల్యే ఉదయభాను చేయూత..

ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించిన లబ్ధిదారులందరికీ జగ్గయ్యపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను తన సొంతఖర్చులతో ఉచితంగా ఇసుకను సరఫరా చేస్తున్నారు. త్వరగా నిర్మాణాలు పూర్తిచేసుకున్నవారికి రూ.10వేలు అందజేస్తూ వారిని ప్రోత్సహిస్తున్నారు. గృహప్రవేశం చేస్తున్నవారికి కూడా నూతనవస్త్రాలను బహూకరిస్తూ లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణాలను పూర్తిచేసుకునేందుకు ఉదయభాను అండగా నిలుస్తున్నారు. ఇలా ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే సహాయ సహకారాలతో పేదలు తమ సొంతింటి కలను నెరవేర్చుకుంటున్నారు.

జగనన్న ఇళ్ల నిర్మాణాల వివరాలు..

మండలం	మంజూరైన ఇళ్లు	నిర్మాణం చేపట్టిన ఇళ్లు	పూర్తయిన ఇళ్ల నిర్మాణం	వివిధ దశల్లో ఉన్న ఇళ్లు
జగ్గయ్యపేట అర్బన్	1,040	861	341	520
జగ్గయ్యపేట రూరల్	1,858	1,249	556	693
పెనుగంచిప్రోలు	2,170	1,970	766	1204
వత్సవాయి	2,534	2,425	976	1449
ఏటిపట్టు గ్రామాలు (నందిగామ మండలం)	1,068	1,013	455	558

జగనన్నకు రుణపడి ఉంటాం..



గత ప్రభుత్వహయాంలో ఇంటి కోసం చాలాసార్లు దరఖాస్తు చేసుకున్నా రాలేదు. జగనన్న ప్రభుత్వం వచ్చాక బలుసుపాడురోడ్‌లో ఇంటిస్థలం ఇచ్చారు. నిర్మాణానికి డబ్బులిచ్చారు. ఇంటి నిర్మాణం పూర్తిచేసుకుని రెండునెలల కిందట గృహప్రవేశం చేశాం . మా సొంతింటి కలను నెరవేర్చిన జగనన్నకు జీవితకాలం రుణపడి ఉంటాం.

దోరేపల్లి ఇందిర,
జగనన్న కాలనీ, జగ్గయ్యపేట.

మా అడ్రస్ జగనన్న కాలనీనే..



గతంలో జన్మభూమి సభల్లో అనేకసార్లు అర్జీలు పెట్టుకున్నా ఫలితం లేకపోయింది. 15ఏళ్లుగా సొంతిల్లు లేక ఇబ్బందులుపడుతున్న మాకు జగనన్న ఓ గూడు కల్పించి సొంతింటి కలను నెరవేర్చారు. ఇంటి నిర్మాణాన్ని పూర్తిచేసుకుని గృహప్రవేశం చేసి జగనన్న కాలనీలో ఉంటున్నాం. సీఎం జగనన్నకి, ఎమ్మెల్యే ఉదయభానుకు కృతజ్ఞతలు.

కనపర్తి సత్యంబాబు,
సుతారు మేస్త్రి, జగ్గయ్యపేట

సకాలంలో బిల్లులు..



నియోజకవర్గ పరిధిలో చేపడుతున్న జగనన్న కాలనీ గృహాలకు సకాలంలో బిల్లులు మంజూరు చేస్తున్నాం. దశలవారీగా సిమెంట్, నిర్మాణాలకు అవసరమైన నీటి సదుపాయం సమకూరుస్తున్నాం. దాదాపు అన్ని చోట్ల విద్యుత్ లైన్లు ఏర్పాటు చేశాం. దీంతో లబ్ధిదారులు ఉత్సాహంగా ఇళ్లనిర్మాణాలు పూర్తిచేసుకుంటున్నారు. నిర్మాణంలో ఉన్న ఇళ్ల పనులు కూడా త్వరితగతిన పూర్తయ్యేలా చూస్తాం.

తోట శివాజీ, ఇన్‌చార్జి హౌసింగ్ డీఈఈ

క్లుప్తంగా

నిర్మాణపు పనుల పరిశీలన



పెనుగంచిప్రోలు: భక్తులకు మౌలిక వసతుల కల్పనలో భాగంగా ఆలయం వద్ద, మునేరు అవతల మామిడి తోటల్లో చేపట్టిన ఏసీ గదులు, కల్యాణమండపం నిర్మాణాలను కాంట్రాక్టర్లు త్వరితగతిన పూర్తిచేయాలని ఆలయ ఈఈ వైకుంఠరావు ఆదేశించారు. ఆయా నిర్మాణాల పనులను శనివారం ఆయన పరిశీలించారు. పనుల్లో నాణ్యత పాటించాలని, త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. ఆయా పనులపై కాంట్రాక్టర్లకు పలు సూచనలు చేశారు. ఈఈ వెంట ఏఈ రాజు ఉన్నారు.

ప్రతిభచూపిన అమ్రితసాయి విద్యార్థులు



కంచికచర్ల : జేఎన్‌టీయూ(కే) సెంట్రల్ జోన్ పరిధిలో బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో కంచికచర్ల మండలంలోని అమ్రితసాయి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు తృతీయ బహుమతిని సాధించారు. కళాశాలలో శనివారం జరిగిన ఓ కార్యక్రమంలో బాల్‌బ్యాడ్మింటన్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులను అమ్రితసాయి కళాశాల కరస్పాండెంట్ అండ్ కార్యదర్శి కె.రామ్మోహనరావు, అధ్యాపకులు అభినందించారు. ఈసందర్భంగా రామోహ్మన్‌రావు మాట్లాడుతూ తమ కళాశాలలో ఇంజినీరింగ్ విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యనందించడంతోపాటు క్రీడల్లోనూ శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులను అభినందించినవారిలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శశిధర్, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ పి.చిరంజీవి, ఫిజికల్ డైరెక్టర్లు పి.శ్రీనివాసరావు, పి.శివకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

ముగిసిన సంగీతోత్సవాలు



విజయవాడ కల్చరల్: గాయక సార్వభౌమ సంగీత పరిషత్ స్వరఝరి సంగీత సాహిత్య సేవా సంస్థ ఆధ్వర్యంలో సంగీత విద్వాంసుడు పారుపల్లి రామకృష్ణయ్య పంతులు 140వ జయంతిని పురస్కరించుకుని నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న సంగీతోత్సవాలు శనివారం ముగిశాయి. కార్యక్రమంలో ప్రవాసాంధ్ర సంగీత విద్వాంసుడు కొరిడే సుధీర్‌శర్మ పలు వాగ్గేయకారుల కీర్తనలను మధురంగా ఆలపించారు. వయోలిన్‌పై ఎస్.జనార్దన్, మృదంగంపై బీఎస్ ప్రశాంత్, కంజీరాపై శ్రీకాంత్ సహకరించారు. సుధీర్‌శర్మ మాట్లాడుతూ శాస్త్రీయ సంగీత విలువలను కాపాడుకోవాల్సిన అవసముందన్నారు. స్వరఝరి అధ్యక్షుడు మోదుమూడి సుధాకర్ మాట్లాడుతూ పారుపల్లి రామకృష్ణయ్య పంతులు స్ఫూర్తితో కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. నిర్వాహకులు సుధీర్‌శర్మను ఆత్మీయంగా సత్కరించారు. కార్యక్రమంలో సంగీత విద్వాంసులు అన్నవరపు రామస్వామి, అంజనా సుధాకర్, వేమూరి విశ్వనాథ్ పాల్గొన్నారు.

యోగాతో మానసిక, శారీరక సమతుల్యత



ఇబ్రహీంపట్నం: నిత్య యోగా సాధన శారీరక, మానసిక సమతుల్యతకు దోహదపడుతుందని ప్రముఖ యోగాగురువు లంకే జనార్దన్ తెలిపారు. స్థానిక ఎస్‌వీసీటీ కల్యాణ మండపంలో శాంతివన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత యోగా శిక్షణ తరగతులు శనివారం ప్రారంభించారు. క్రమంతప్పని యోగాతో మెరుగైన ఆరోగ్యం పొందవచ్చన్నారు. సూక్ష్మ వ్యాయామాలు, ఆసనాలు సాధన చేయించారు. తొలుత ఎన్టీటీపీఎస్ ఎస్ఈ సురేష్‌బాబు జ్యోతి వెలిగించి శిక్షణ శిబిరం ప్రారంభించారు. ఏఈఈ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

నేడు కాపు కార్తీక వనసమారాధన



జగ్గయ్యపేట అర్బన్ : పట్టణంలోని శ్రీకృష్ణదేవరాయ సేవాసమితి(కాపుసంఘం) ఆధ్వర్యంలో ఆదివారం కార్తిక వనసమారాధన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సమితి నాయకులు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా సేవా సమితి అధ్యక్షుడు యలమంచి నాగరాజేంద్రప్రసాద్, ప్రధాన కార్యదర్శి ముత్యాల శేషు, కోశాధికారి కామిశెట్టి అమరనాథ్, గౌరవాధ్యక్షుడు గోగుశెట్టి మహేష్ తదితరులు శనివారం జగ్గయ్యపేట ఎమ్మెల్యే, విప్ సామినేని ఉదయభానును ఆయన నివాసంలో కలసి వనసమారాధనకు హాజరుకావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా సేవాసమితి నాయకులు మాట్లాడుతూ వత్సవాయి మండలం దేచుపాలెం వద్ద నున్న మంగొల్లు రోడ్‌లోని అల్ఫాఫా గార్డెన్‌లో వనసమారాధనను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి ఉదయభానుతోపాటు కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు, రాష్ట్ర కాపు నేతలు అతిథులుగా హాజరుకానున్నట్లు చెప్పారు. కాపు సోదరులంతా కుటుంబ సమేతంగా పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు కోరారు. సేవాసమితి ప్రతినిధులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది : ఎంపీపీ

వీరులపాడు: మండలంలోని జయంతి, పెద్దాపురం గ్రామాల్లో తుపాను కారణంగా దెబ్బతిన్న పంట పొలాలను ఎంపీపీ కోటేరు లక్ష్మి శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఎంపీపీ లక్ష్మి మాట్లాడుతూ తుపాను కారణంగా నష్టపోయిన ప్రతిరైతును రాష్ట్రప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. ఏ ఒక్కరైతు కూడా అధైర్యపడవద్దని, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బాధిత రైతులకు అన్నిరకాలుగా అండగా ఉండి ఆదుకుంటారని వివరించారు. ఇప్పటికే వ్యవసాయ, ఉద్యాన శాఖాధికారులు పంట నష్టం అంచనాలను సిద్ధం చేస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మారపాక మహాలక్ష్మి, నిప్పులపల్లి శాంతమ్మ, ఎంపీటీసీ సభ్యుడు ఇప్పల సత్యనారాయణరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జంగా కోటిరెడ్డి, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు



పత్తి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

గరికపాడు(జగ్గయ్యపేట అర్బన్): అకాల వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలను కాపాడుకునేందుకు రైతులు పలుజాగ్రత్తలు పాటించాలని కృషివిజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ కృష్ణంరాజు సూచించారు. గరికపాడు కృషివిజ్ఞాన కేంద్రం వారి ఆధ్వర్యంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు శనివారం నందిగామ డివిజన్‌లోని ఆయా గ్రామాల్లో పర్యటించి, దెబ్బతిన్న పంటపొలాలను పరిశీలించారు.రైతులతో మాట్లాడి పంటను కాపాడుకునేందుకు వారికి తగు సూచనలిచ్చారు. ఈసందర్భంగా డాక్టర్ కృష్ణంరాజు మాట్లాడుతూ వరిపొలంలో నీటిని తొలగించాలన్నారు. కోతకు వచ్చిన వరిపంటను వెంటనే కోసుకోవాలని సూచించారు. కోతకు సమయం ఇంకా సమయం ఉన్నట్లయితే అటువంటి పొలాల్లో పాయలు చేసినట్లయితే పొలం ఆరడంతోపాటు గింజరంగు మారకుండా ఉంటుందన్నారు. 10, 15రోజుల్లో కోతకు వచ్చే పంటకు ప్రొపికోనోజోల్ పిచికారీ చేయాలన్నారు. మూడోవిడత పత్తితీతలు చేపట్టని రైతులు కొద్దిరోజులపాటు ఎండకు ఎండనిచ్చి ఆ తర్వాత తీతలు మొదలుపెట్టాలని సూచించారు. ఈ వర్షాలకు మీటరు ఎత్తులో ఉన్న మొక్కజొన్న మొక్కలు పాక్షికంగా నేలకొరిగాయని, ఇలా ఒరిగిన పొలంలో మట్టిని ఎత్తుగా ఎగదోస్తూ ఉంటే నష్టాన్ని పూరించుకోవచ్చని ఆయన సూచించారు. ఈ పర్యటనలో వ్యవసాయ శాస్త్రవేత్తలు శివప్రసాద్, వెంకటరెడ్డి, జస్వంత్‌రెడ్డి పాల్గొని రైతులకు సలహాలు ఇచ్చారు.

వన సమారాధనల సందడి



ఆటపాటలతో కేరింతలు కొడుతున్న విద్యార్థులు



నందిగామలో సామూహిక సత్యనారాయణ వ్రతం ఆచరిస్తున్న దంపతులు

నందిగామ: కార్తికమాసాన్ని పురస్కరించుకుని నందిగామ మండలంలోని మామిడి వనాల్లో శనివారం సందడి నెలకొంది. ఆయా సామాజికవర్గాల వారితోపాటు పలు విద్యాసంస్థల విద్యార్థులు కూడా వనాల్లో సందడి చేశారు. ఆటపాటలతో చిన్నారులు, పెద్దలు సందడి చేశారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పట్టణ శివారుల్లోని చల్లా సంగయ్య గార్డెన్స్‌లో నిర్వహించిన వనసమారాధనలో భాగంగా సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి కూడా ఆర్యవైశ్యులు భారీగా తరలివచ్చారు. దీంతో మున్నేటి తీరంలోని మామిడి తోటలు సందడిగా మారాయి.

పెనుగంచిప్రోలులో..

పెనుగంచిప్రోలు: స్థానిక మునేరు అవతల ఉన్న మామిడితోటలు శనివారం వన సమారాధనలతో శనివారం కళకళలాడాయి. పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు తోటల్లో ఉదయం నుంచి సాయంత్రం దాకా ఆటపాటలతో సరదాగా గడిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి సామూహిక భోజనాలు చేశారు. వత్సవాయి మండలం మక్కపేట గ్రామానికి చెందిన శ్రీసాయి సెంచరీ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆటపాటలతో సరదాగా గడపారు. ప్రిన్సిపాల్ సవితా భరద్వాజ్, కొమరగిరి భరద్వాజ్ పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లో 996 కేసుల పరిష్కారం



మాట్లాడుతున్న జడ్జి వి.శ్రీనివాసరావు

నందిగామ: లోక్ అదాలత్‌ల ద్వారా కేసులను సత్వరం పరిష్కరించుకోవచ్చని జిల్లా 16వ అదనపు కోర్టు న్యాయమూర్తి వి.శ్రీనివాసరావు సూచించారు. స్థానిక కోర్టుల ఆవరణలో శనివారం జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. న్యాయమూర్తులు వి.శ్రీనివాసరావు, ఎస్‌కే రియాజ్ పాల్గొని మొత్తం 996 కేసులను పరిష్కరించారు. ఈసందర్భంగా నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో జడ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ లోక్‌అదాలత్‌ల ద్వారా కక్షిదారుల సొమ్ము, సమయం ఆదా అవుతాయని తెలిపారు. ఇరువర్గాలు రాజీపడితే లోక్‌అదాలత్‌ను సంప్రదించవచ్చని, తద్వారా ఒకేరోజులో కేసు పరిష్కారమవుతుందన్నారు. లోక్‌అదాలత్ కార్యక్రమం కక్షిదారులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని వివరించారు. 996 కేసుల పరిష్కారం ద్వారా బాధితులకు నష్ట పరిహారంగా రూ.85,63,309 అందజేశారు.

బహుజన అధికారులు, ఉద్యోగుల ఫెడరేషన్ ఆవిర్భావం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బహుజన సిద్ధాంత–భావజాలాలతో బహుజన ఆఫీసర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (బోఫ్) ఆవిర్భవించింది. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన సమావేశంలో ఫెడరేషన్ ఆవిర్భావ సభ జరిగింది. సమాఖ్య జాతీయ అధ్యక్షుడిగా డాక్టర్ దేవరకొండ వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడిగా షేక్ అబ్దుల్ రజాక్, ఏపీ అధ్యక్షుడిగా ముత్తవల్లి అబ్దుల్ సలార్, కార్యదర్శిగా దేవరకొండ సాంబశివరావు, ఉపాధ్యక్షుడిగా ప్రణీత వర్మ నియమితులయ్యారు.

ఈసీ ప్రకటనతో టీడీపీ నాయకుల్లో వణుకు

ప్రభుత్వ విప్ ఉదయభాను



విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: ఒక వ్యక్తికి ఒకచోట మాత్రమే ఓటు హక్కు ఉండాలని, తప్పుడు సమాచారంతో వేరేచోట ఓటు కలిగి ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని ఎన్నికల కమిషన్ హెచ్చరించడంతో టీడీపీ నాయకుల వెన్నులో వణుకు మొదలైందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టీడీపీ సానుభూతిపరుల ఓట్లను తొలగిస్తున్నారంటూ ఆపార్టీ నాయకులు చేస్తున్న ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. ఓటమి భయంతో టీడీపీ నాయకులు తమపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఒకవ్యక్తికి ఒకచోట మాత్రమే ఓటు ఉండాలనే నిబంధనకు వైఎస్సార్ సీపీ కట్టుబడి ఉందన్నారు. అందులో భాగంగానే రెండు చోట్ల ఓటు ఉన్నవారిని గుర్తించి, వారిని తొలగించాలని కోరుతూ ఫారం–7 వేస్తున్నామని చెప్పారు. ఓట్ల తొలగింపు, చేరికలపై నిష్పక్షపాతంగా వ్యవహరించాలని ఎన్నికల అధికారులకు తాము కూడా అనేకసార్లు కోరిన వైనాన్ని గుర్తుచేశారు. టీడీపీ నాయకులే వైఎస్సార్ సీపీ సానుభూతిపరుల ఓట్లను తీసివేసేందుకు భారీ కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. అందులో భాగంగానే ఇంటింటికి తిరుగుతూ ప్రజల వ్యక్తిగత సమాచారం సేకరిస్తూ ఓటీపీలను అడుగుతున్నారన్నారు. ప్రజలెవరూ ఓటీపీలను వెల్లడించకుండా, టీడీపీ వారి కుతంత్రాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. టీడీపీ నాయకులు వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని ప్రణాళికలు వేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. వారిని ప్రజాక్షేత్రంలో దోషులుగా నిలబెడతామని హెచ్చరించారు. టీడీపీ కుట్రలపై ఎన్నికల అధికారులు దృష్టి సారించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ఎమ్మెల్యే ఉదయభాను తన ప్రకటనలో కోరారు.

ర్యాష్ డ్రైవింగ్‌తో జనం బెంబేలు



బైక్‌తో విన్యాసాలు చేస్తున్న యువకులు

నందిగామ: నందిగామ పట్టణంలోని ఎన్టీఆర్ రోడ్డు కొంతమంది ఆకతాయిల ర్యాష్ డ్రైవింగ్‌కు కేరాఫ్ అడ్రస్‌గా మారిపోయింది. పట్టణంలో ప్రధాన రహదారుల్లో ఒకటిగా ఉన్న ఈరోడ్డులో నిత్యం వేలాదిమంది రాకపోకలు సాగిస్తూ ఉంటారు. పలు విద్యాసంస్థలకు వెళ్లేందుకు కూడా ఇదే ప్రధాన రహదారి కావడంతో ఉదయం, సాయంత్రం సమయాల్లో రద్దీ అధికంగా ఉంటుంది. గతంలో సీఎం రోడ్డు పేరుతో ఉన్న ఈ రహదారి చిన్నదిగా ఉండి నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతుండటంతో విశాలంగా ఉండేలా విస్తరణపనులు చేపట్టి ఎన్టీఆర్ రోడ్డుగా నామకరణం చేశారు.

ఆకతాయిల చేష్టలతో ఆందోళన..

విశాలంగా ఉన్న ఎన్టీఆర్ రోడ్‌లో కొందరు ఆకతాయిలు ర్యాష్ డ్రైవింగ్, స్నేక్ డ్రైవింగ్ చేస్తున్నారు. మరికొందరు బైక్ రేసులు నిర్వహిస్తున్నారు. ఆకతాయిలు ఉదయం, సాయంత్రం సమయాల్లో ఈ తరహా చేష్టలకు పాల్పడుతుండటంతో తోటి వాహన చోదకులు , పాదచారులు భయాందోళనకు గురవుతున్నారు. పట్టణంలోని రైతుపేటలోగల 65వ నంబర్ జాతీయ రహదారి నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ఉన్న ఈ రోడ్డులో ఆకతాయిలు వారి బైక్‌లకు నంబర్ ప్లేట్లు కూడా తీసివేస్తున్నారు. దీంతో ర్యాష్ డ్రైవింగ్‌కు పాల్పడేవారిని గుర్తించడం కూడా కొన్నిమార్లు పోలీసులకు కష్టమవుతోంది. ఇకనైనా పోలీసులు స్పందించి బైక్‌లతో విన్యాసాలు, ర్యాష్ డ్రైవింగ్ చేసే వాహనచోదకులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై పట్టణ పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్ హనీష్‌ను వివరణ కారణంగా ఆ రహదారిలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు ఆవశ్యకతను ఇప్పటికే మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. పటిష్ట నిఘా చర్యలు చేపట్టి ర్యాష్ డ్రైవింగ్‌కు పాల్పడేవారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆయుర్వేద ఆస్పత్రికి నూతన సొబగులు

- అనిగండ్లపాడు ఆస్పత్రిలో మెరుగుపడిన మౌలికవసతులు
- అందుబాటులో అన్ని రకాల మందులు
- పెరిగిన ఓపీ సంఖ్య



నూతన హంగులతో అనిగండ్లపాడు ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి



రోగులకు చికిత్స అందిస్తున్న డాక్టర్ రత్నప్రియదర్శిని

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): మండలంలోని అనిగండ్లపాడు ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రికి నూతన హంగులు సమకూరాయి. వసతులు మెరుగుపడ్డాయి. గతంలో కేవలం ఒకరిద్దరు రోగులు మాత్రమే వచ్చే ఆసుపత్రికి రోగుల సంఖ్య రోజుకు 20 నుంచి 25 మందికి పెరిగింది. జాతీయ ఆయుష్ మిషన్ కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పర్యవేక్షణలో ఆయుష్ వైద్యశాలల అభివృద్ధికి చర్యలు తీసుకోవడంతో అనిగండ్లపాడు ఆయుర్వేద ఆస్పత్రి మహర్దశ పట్టింది.

రూ.5.25లక్షలతో పనులు..

ఆయుష్ మిషన్ కింద ఈ వైద్యశాలకు రూ.3.50 లక్షలు మంజూరు కాగా, దాతలు రూ.1.75 లక్షలు విరాళాలుగా అందజేశారు. ఈ నిధులతో పెచ్చులూడి ఉన్న ఆస్పత్రి భవనం శ్లాబు పైపొర తొలగించి, తిరిగి శ్లాబు వేశారు. పంచకర్మ వైద్యం కోసం వచ్చేవారి కోసం ప్రత్యేకంగా గది ఏర్పాటు, ఆస్పత్రిలోపల టైల్స్, యోగా గది, మందుల గది ఏర్పాటుతోపాటు విద్యుద్దీకరణ పనులు చేశారు. భవనానికి రంగులు వేసి సుందరంగా తీర్చిదిద్దారు. గతంతో పోలిస్తే ఆసుపత్రి పరిసరాలు పూర్తిగా మారిపోయి, వసతులు మెరుగుపడ్డాయంటూ వైద్యశాలకు వచ్చే రోగులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు.

రూ.1.20లక్షలతో మందులకు టెండర్..

ఆసుపత్రిలో సాధారణ వ్యాధులతోపాటు కీళ్ల వాతం, పక్ష వాతం, కంపవాతం, నోటివాతం, గ్యాస్ నొప్పులు, సొరయాసిస్ వంటి చర్మవ్యాధుల జబ్బులతోపాటు బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులకు కూడా ఆయుర్వేద మందులు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. రూ.1.20 లక్షలకు మందులు కోసం టెండర్లు పూర్తయ్యాయని, విడతల వారీగా మందులు వైద్యశాలకు సరఫరా అవుతున్నట్లు చెప్పారు. అనిగండ్లపాడుతోపాటు ఇతర గ్రామాల నుంచి రోగులు వస్తుండగా, వైద్యసిబ్బంది ప్రత్యేకంగా శిబిరాలు కూడా ఏర్పాటు చేస్తున్నారు.

రోగులకు మెరుగైన వైద్యం...వై.రత్న ప్రియదర్శిని, వైద్యాధికారి

ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఆసుపత్రిలో వసతులు మెరుగుపడ్డాయి. రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నాం. హెల్త్ వెల్‌నెస్ సెంటర్ కూడా మంజూరైతే రోగులకు మరిన్ని వైద్యసేవలు అందుతాయి. ఆసుపత్రి ఆవరణలో ఔషధ మొక్కలతో గార్డెన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం.